## క్లుప్తంగా

### మృతుడి కుటుంబానికి పలువురి పరామర్శ

**వేములపల్లి :** మండల కేంద్రానికి చెందిన మాజీ సింగిల్‌విండో చైర్మన్ పందిరి ప్రతాప్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్ ప్రతాప్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరా మర్శించారు. అదేవిధంగా ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ పందిరి ప్రతాప్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో టీపీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, రాంరెడ్డి, పెద్ద వెంకన్న, నాగవెల్లి మధు, వినోద్, గిరి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

### మానవాళి అభివృద్ధిలో చెట్లు కీలకం


మొక్క నాటుతున్న సంస్థ సభ్యులు

**మిర్యాలగూడ అర్బన్ :** మానవాళి అభివృద్ధిలో చెట్లు ఎంతో కీలకమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఛేంజ్ మేకర్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు అవి పెరిగి పెద్దయ్యేంత వరకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాధవి, సైదులు, గార్లపాటి పద్మ, కందుకూరి గీత, పల్‌రెడ్డి కళావతి, సాయి, విశిష్ట, స్వాతీ, స్వర్ణలత, కేశిరెడ్డి శ్రవంతి, లక్ష్మమ్మ, స్వప్న, ఉషాశర్మ ఉన్నారు.

### వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

**మిర్యాలగూడ టౌన్ :** మిర్యాలగూడ పట్టణంలోని పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, పులిహోర ప్యాకెట్లను అద్విత ఫౌండేషన్ చైర్మన్ మేరావత్ శివనాయక్ సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు పర్వనబోయిన సతీష్, ప్రధాన కార్యదర్శి పాతులోతు సురేష్‌నాయక్, జాయింట్ సెక్రటరీ దిలీప్, లింగంపల్లి జగదీష్, మీరవత్ బికోజి, నాగరాజు, కుమార్, బంటు, యశ్వంత్ తదితరులున్నారు.

### జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


జయశంకర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ చేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

**మిర్యాలగూడ :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో నిర్మించే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ప్రతిష్ఠాపన భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో జయశంకర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేశిడి శేఖర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, పగిడిమర్రి గోవర్ధనచారి, పాతూరి శరత్, గడగోజు అశోక్, ధనావత్ నాగునాయక్, జాస్తి అమర్, అడోతు నాగరాజునాయక్ పాల్గొన్నారు.

### నారాయణరెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

**నల్లగొండ టూటౌన్ :** డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) 93వ జయంతి వేడుకలను రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి రాసిన సినీ పాటల పోటీల్లో 22 మంది గాయకులు పాల్గొని పాటలు పాడారు. ప్రతిభ కనబర్చిన మారోజు కేశవాచారికి మొదటి బహుమతి, తాడూరి రమేష్‌కు ద్వితీయ బహుమతి, మాచర్ల మహేశ్వర్‌కు తృతీయ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సంఘం నల్లగొండ మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం, కార్యదర్శి యాదవాసుదేవ్, జిల్లా పుల్లయ్య, రవి ప్రసాద్, వెంకశరావు, చొల్లేటి ప్రభాకర్, ప్రకాశ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సన్నాల సాగుకే మొగ్గు


హాలియాలో రైతు సాగు చేస్తున్న సన్నరకం వరి నారుమడి


హాలియాలో రైతు పొలంలో నాట్లు వేస్తున్న మహిళలు

- ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో ముమ్మరంగా నాట్లు
- మార్కెట్‌లో ధర ఉండడం, ప్రభుత్వ బోనస్‌తో రైతుల దృష్టి
- వరినాట్లు వేసిన 5వేల ఎకరాల్లో 4వేలు సన్నాలే..

**హాలియా :** రాష్ట్ర ప్రభుత్వం చేసిన 'బోనస్' ప్రకటనతో నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులంతా సన్నాల వైపు మళ్లారు. ఆయకట్టులో రైతులు ఇన్నాళ్లు వరి పంటలో సింహభాగం దొడ్డు రకాలే సాగు చేయగా ఈ ఏడాది వానాకాలం సీజన్ వచ్చే సరికి అందుకు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గతానికి భిన్నంగా ఈ వానాకాలం సీజన్‌లో నూటికి 70 శాతం మంది రైతులు సన్నాలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో సన్న వడ్లకు మంచి ధర ఉండడం..సన్నరకాలు సాగు చేస్తే క్వింటాకు అదనంగా రూ. 500 బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆయకట్టు పరిధిలో సన్నాల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి వరకు నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో 5వేల ఎకరాల్లో నాట్లు వేయగా అందులో 4వేల ఎకరాల్లో సన్నాలే ఉన్నాయని వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

**సాగర్ ప్రాజెక్ట్ వరద వస్తుండడంతో..**

సన్న రకమైన సాంబా మసూరి, 101, పొట్టి చింట్లు, హెచ్‌ఎంటీ, చిట్టి పొట్టి, చేతక్, రోలి, పూజ, 606, శ్రీ, పద్మ, బీపీటీ వంటి రకాల విత్తనాలను ఎక్కువగా కొనుగోలు చేసి రైతులు నార్లు పోశారు. దొడ్డు రకం సాగుచేస్తే పంటను అమ్ముకునే సమయంలో చాలా అవస్థలు పడాల్సి వస్తుందని భావించిన రైతులు సన్నరకం వడ్ల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండడంతో ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టులోని వ్యవసాయ సాగుపై ఆశలు పెట్టుకున్నారు. గిట్టుబాటు అవుతుందని.. సన్నరకాలు సాగు చేస్తే సులభంగా మార్కెంటింగ్‌తో పాటు అధిక ధర పలుకుతుందని రైతులు ఆశిస్తున్నారు. గతేడాది వానాకాలం, యాసంగిలో సన్నరకం సాగు చేసిన రైతులకు మిల్లులు, మార్కెట్ యార్డుల్లో మంచి ధర పడింది. అది కూడా హార్వెస్ట్ చేసిన వెంటనే మిల్లుల యజమానులు కొనుగోలు చేశారు. ఇలా పచ్చి ధాన్యం సన్నరకాలు క్వింటాకు రూ. 2,800 వరకు పెట్టి వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్-ఏ రకం రూ. 2,260, సాధారణ గ్రేడ్ రూ. 2,220 మాత్రమే పెట్టారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యం ఆరబోసి తేమ శాతం లేకుండా చూసి గాలి, దుమారం, వర్షానికి ఇబ్బంది పడి అమ్మడం కన్నా సన్నాలు వేస్తే ఏ చికాకు లేకుండా మంచి ధరకు అమ్మే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది మద్దతు ధర గతేడాది కన్నా క్వింటాలుకు రూ. 100 పెంచడంతో గ్రేడ్-ఏ రకం రూ. 2360 పలుకుతోంది. దీనికి తోడు ప్రభుత్వం చెప్పిన విధంగా సన్న రకాలకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తే ధర రూ. 2,860కి చేరుతుందన్న ఆలోచనతో రైతులు ఈ దిశగా సాగు చేస్తున్నారు.

**అమ్ముకునేందుకు సులభంగా..**

దొడ్డురకం సాగుచేస్తే పంటను అమ్ముకునే సమయంలో చాలా అవస్థలు పడాల్సి వస్తుండడంతో ఆయకట్టు పరిధిలోని రైతులు సన్నరకం వడ్ల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. గతేడాది వివిధ రకాల వరిసాగు చేసినా..ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ దృష్ట్యా ఈ సీజన్‌లో సన్నాల సాగు వైపు దృష్టి సారించారు. మార్కెట్‌లో మంచి ధర వస్తుండడం, దీనికి తోడు సన్నరకాలకు క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. ఆయకట్టులో ఉన్న రైతులు ఎక్కువగా సన్నాల సాగుకే సిద్ధమయ్యారు.

**తొమ్మిది ఎకరాల్లో సాగు చేశా**



ప్రభుత్వం సన్నరకం వడ్లకు అదనంగా రూ. 500లు బోనస్ ప్రకటించడంతో ఆయకట్టులోని రైతులు ఈ ఏడాది వానా కాలం సీజన్‌లో సన్నరకాల విత్తనాలే నార్లు పోశారు. నేను కూడా సన్నరకం విత్తనాలను నార్లు పోసి తొమ్మిది ఎకరాల్లో వరి నాట్లు వేయించాను. దొడ్డురకం సాగు చేస్తే పంటను అమ్ముకునే సమయంలో చాలా అవస్థలు పడాల్సి వస్తుంది. సన్నాలకు మార్కెట్‌లో మంచి ధర కూడా వస్తుండడంతో పాటు ప్రభుత్వం సన్నవడ్లకు మద్దతు ధర ఇస్తామంటుంది.

– అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, రైతు, త్రిపురారం

## కేజీబీవీ విద్యార్థులకు చాలీచాలని భోజనం


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌యూఐ నేతలు

**అడవిదేవులపల్లి :** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులకు చాలీచాలని భోజనం పెడుతున్నారని ఎస్‌ఎస్‌యూఐ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రలోని కేజీబీవీని ఎస్‌ఎస్‌యూఐ మండల శాఖ నేతలు సోమవారం సందర్శించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో మధ్యాహ్నం సమయంలో భోజనం సరిపోవడం లేదని, ఉదయం అల్పాహారంలో కూడా చట్నీ పెట్టకుండా కారం వేస్తున్నారని నాయకులకు విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షులు గొడుగు హనుమయ్య మాట్లాడుతూ ఈ విద్యాలయంలో విద్యార్థులకు మెనూ కూడా సక్రమంగా అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఒక వైపు విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టాలని చెబుతున్నప్పటికీ విద్యాలయంలో మాత్రం అధికారుల మాటలను బేఖాతర్ చేస్తూ విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టకపోవడంతో వస్తులుంటున్నారన్నారు. పాఠశాల విద్యార్థులకు సరిపడ భోజనం పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పోషమల్ల నరేష్, రమేష్, ఉదయ్, ఇండ్ల నాగయ్య తదితరులున్నారు.

## తిరుమలగిరి(సాగర్) మండల ఎస్‌ఐగా శ్రీనునాయక్

**తిరుమలగిరి(నాగార్జునసాగర్):** తిరుమలగిరి(సాగర్) మండల నూతన ఎస్‌ఐగా బి. శ్రీను నాయక్‌ను నియమిస్తూ సోమవారం జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చే శారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ నారాయణరెడ్డిని వీఆర్ కు అటాచ్ చేయగా మిర్యాలగూడ వన్‌టౌన్‌లో పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న బి. శ్రీనునాయక్ తిరుమలగిరి ఎస్‌ఐగా నియమితులయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

## పొజిషన్ పట్టాలు ఇవ్వాలి

**నల్లగొండ టౌన్:** సాగర్ రోడ్డులోని ముత్యాలమ్మ కాలనీలోగల ప్రభుత్వ భూమిలో గృహాలు నిర్మించుకున్న వారికి పొజిషన్ పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నల్లగొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కొందరికే జీఓ నంబర్ 58, 59 ప్రకారం పట్టాలు ఇచ్చారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో విజయ, విశ్వనాథుల లెనిన్, సుజాత, కౌసల్య, ముస్రుత్‌బేగం, సైదమ్మ, మాధవి, శంకరమ్మ, రేణుక, కుమారి, రాములమ్మ, హైమావతి, రంగమ్మ, గిరయ్య, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల ధర్మ దీక్ష కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న మాదిగ కూటమి నాయకులు

**మిర్యాలగూడ టౌన్ :** ఎస్సీ వర్గీకరణ కోసం ఆగస్టు 5న ఢిల్లీలో నిర్వహించే మాదిగల ధర్మ దీక్ష కరపత్రాన్ని సోమవారం పట్టణ కేంద్రంలో మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ కూటమి నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని ఉద్యమాలు చేపడుతున్నప్పటికీ పాలకులకు పట్టింపు లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని చెప్పిన బీజేపీ 10ఏళ్లు అవుతున్నప్పటికీ మాటమార్చి మాదిగలను మోసం చేస్తుందన్నారు. ఢిల్లీలో నిర్వహించే మాదిగల ధర్మ దీక్షను విజయవంతం చేసేందుకు యువకులు, మహిళలు, నిరుద్యోగులు భారీగా తరలిరావాలని కోరారు. కరపత్రం విడుదల చేసిన వారిలో ఆ సంఘం నాయకులు ఉదయ్‌కుమార్, రవికుమార్, రామకృష్ణ, శ్రీను, దైద రవికుమార్, సైదులు, సైదులు, సైదులు, మధు, శేఖర్, సంజీవ్, వెంకటయ్య, కిరణ్, శ్రీను, బాబు, శోభన్, శేఖర్, కోటి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసు


కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ నాగార్జున

**మిర్యాలగూడ అర్బన్ :** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ నాగార్జున అన్నారు. సోమవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే పది మందిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు మద్యం వల్ల కలిగే నష్టాలు వారికి వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించినా, రాత్రి సమయంలో రోడ్లపై మద్యం మత్తులో హల్‌చల్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే స్థానికులు గుర్తించి డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ లు క్రిష్ణయ్య, మొహన్ ఉన్నారు.

**త్రిపురారం :** బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని త్రిపురారం ఎస్‌ఐ వీర శేఖర్ హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని బాబుసాయిపేట, నీలాయిగూడెం రోడ్డులో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ వీర శేఖర్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై దాడులు చేసి పట్టుకొని కౌన్సిలింగ్ నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం నేరం కాబట్టి కఠిన చర్యలు ఉంటాయన్నారు.

## రంగస్థల నటులకు సన్మానం


వల్లాబట్ల లక్ష్మీనారాయణశర్మను సన్మానిస్తున్న శివాని ఆర్ట్స్ నిర్వాహకులు


పులి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న శివాని ఆర్ట్స్ నిర్వాహకులు

**మిర్యాలగూడ అర్బన్ :** నాటక రంగంలో విశేష సేవలందించిన పట్టణానికి చెందిన కళాకారులు పులి కృష్ణమూర్తిశర్మ, వల్లాబట్ల లక్ష్మీనారాయణశర్మ లను సోమవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో శివాని ఆర్ట్స్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. రంగస్థల నటులకు ప్రేక్షకుల చప్పట్లే వెలకట్టలేని అవార్డులతో సమానమన్నారు. గత 45ఏళ్లుగా నాటకరంగంలో వివిధ పాత్రలను పోషిస్తూ ఆ పాత్రలకు రూపాన్ని అందిస్తూ సాంస్కృతిక పద్య, సాంఘీక నాటికలను రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతున్న రంగస్థల నటులను సన్మానించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమని లీలావతి, శివాని వ్యవస్థాపక అధ్యక్షులు బాపనపల్లి పరమేష్, తడకమళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం

**నల్లగొండ టూటౌన్ :** సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్య కారణాలతో వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 112 మంది నిరుపేద ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.36,26,500 విలువ గల చెక్కులను సోమవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో గుత్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ద్వారా లక్షలాది మంది పేదలకు సహాయం అందుతోందన్నారు. కార్యక్రమంలో యామ దయాకర్, పసల శౌరయ్య ఐతగాని స్వామిగౌడ్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నల్లగొండ టౌన్ :** పట్టణంలోని ఆరో వార్డు పరిధి శాంతినగర్‌కు చెందిన జియాబున్నీసాబేగం, ఎం.రాజ్యలక్ష్మికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.31,500, రూ.60 వేల విలువ గల చెక్కులను సోమవారం 6వ వార్డు కౌన్సిలర్ కర్నాటి కరుణాకర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి మంజూరు చేయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, కౌన్సిలర్ కరుణాకర్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

**నల్లగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మేరు సహకార సొసైటీకి రూ.50 కోట్లు కేటాయించడంపై వ్యక్తం చేస్తూ సోమవారం గడియారం సెంటర్‌లో పట్టణ మేరు సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మేరు సంఘం పట్టణ అధ్యక్షుడు నామ రాంప్రసాద్, రామకృష్ణ, రాపర్తి వెంకన్న, కిరణ్‌కుమార్, నర్సింహ, శ్రీనివాస్, ప్రకాష్, భద్రయ్య, కిషన్, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

## నూతన విధానాన్ని విరమించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

**దేవరకొండ :** నూతన విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి,జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు.సోమవారం దేవరకొండలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ హరేరామ హరేకృష్ణ సంస్థ ప్రతినిధులతో చర్చించి సెంట్రలైజ్డ్ కిచెన్ విధానంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5వేల మందికి పైగా మధ్యాహ్న భోజన కార్మికులు రోడ్డున పడుతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 31న నిర్వహించ తలపెట్టిన ×చలో హైద్రాబాద్Ÿను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నూనె వెంకటేశ్వర్లు, జూలూరు వెంకట్రా ములు, జంగమ్మ, మల్లయ్య, ధనలక్ష్మీ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## జనమైత్రి ఫౌండేషన్‌కు మదర్‌థెరిస్సా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ మునీర్

**మిర్యాలగూడ అర్బన్:** స్వచ్ఛంద సేవా సంస్థ జనమైత్రి ఫౌండేషన్‌కు ప్రతిష్ఠాత్మకమైన మదర్ థెరిస్సా అంతర్జాతీయ పరస్కారానికి ఎంపికైంది. సోమవారం న్యూ ఢిల్లీలోని లార్డ్ హీ రోడ్డులోని శ్రీ సత్యసాయి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ మునీర్ అహ్మద్ షరీఫ్ అందుకున్నారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ కె.వెంకటేషన్, కంట్రీ పాలిటిక్స్ నేషనల వీక్లీ చీఫ్ ఎడిటర్ డాక్టర్ విపిన్ గౌర్, అఖిల భారత క్షత్రియ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ రాజు మన్వేంద్ర సింగ్‌లు ఈ పురస్కారాన్ని అందజేసినట్లు, తమ ఫౌండేషన్ ద్వార నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందించిన నిర్వాహకులుకు మునీర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల తీరు మారాలి


మాట్లాడుతున్న నాయకులు

**మిర్యాలగూడ టౌన్ :** ఉపాధ్యాయుల పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల తీరు మారాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మారం శ్రీనివాస్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్‌లు కోరారు. సోమవారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు చేస్తున్న తప్పిదాలు సరి చేయాల్సిన తల్లిదండ్రులు పట్టించుకోకపోగా సరి చేసే క్రమంలో ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల వేషధారణ, వ్యవహార శైలీ ఉపాధ్యాయులను ఆందోళన కలిగిస్తుందన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు శిరీషాను సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు నెలల నుంచి కటింగ్ విషయంలో హెచ్చరిస్తున్న అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు పెడచెవిన పెట్టారన్నారు. ఈ సమావేశంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య, సురేందర్‌రెడ్డి, ముత్యాలు, మక్లానాయక్, జయరాజు తదితరులున్నారు.

## సమాజ సేవలోనే నిజమైన ఆనందం


నెల్లికల్లులో ఆర్థికసాయం అందజేస్తున్న పాండురంగారెడ్డి

**తిరుమలగిరి(నాగార్జునసాగర్):** మనకు ఉన్న దానిలో కొంత సమాజ సేవ కోసం ఖర్చు చేసినప్పుడే నిజమైన ఆనందం కలుగుతుందని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాయకునితండాలో చర్చి నిర్మాణం కోసం రూ.25వేలు, మండలంలోని నెల్లికల్లు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కనకరాజు ఈదమ్మ, అబ్దుల్ సమ్మద్, మేలోజు సౌభాగ్యమ్మ, కెక్కర కాశయ్యలకు ఒకొక్కరికి రూ. 5వేల చొప్పున ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అభాగ్యులను తన వంతుగా ఆదుకునేందుకే ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న నిరుపేదల సమస్యలు, బాధలు వింటుంటే ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి సమాజసేవ చేయాలనే తన ఆలోచన తన జీవితంలో తీసుకున్న సరైన నిర్ణయమనే భావన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, నాయకులు మేరావత్ ముని నాయక్, నడ్డి లింగయ్య, జనార్దన్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి, బిచ్యాలు. మోతీ నాయక్, సక్రు నాయక్ పాల్గొన్నారు.

## అభంగాపురంలో తాగు నీటికి కష్టాలు


పొలంలోని బోరు వద్ద నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు


ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

**వేములపల్లి(మాడుగులపల్లి):** మండలంలోని అభంగాపురంలో తాగునీరు రాకపోవడంతో నీటి కోసం గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో గ్రామ పంచాయతీకి సంబంధించిన మూడు బోర్లు నీరు పోయకపోవడంతో ప్రజలు చేసేదేమి లేక సమీప పొలాల్లోని రైతుల బోర్ల వద్దకు వెళ్లి బిందెలతో, క్యాన్లతో నీటిని తెచ్చుకుంటున్నారు. అదేవిధంగా ఎప్పుడో ఒక్కసారి వచ్చే నీటి ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

**డిండి :** ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లిలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో సీపీఐ తరుపున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు తూం బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి బొల్లే శైలేష్ నూనే వెంకటేశ్వర్లు, రంగారెడ్డి పాల్గొన్నారు.

## పడమటి తండాలో తీజ్ వేడుకలు


తీజ్ వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

**మిర్యాలగూడ :** దామరచర్ల మండలంలోని పడమటితండాలో గిరిజన మహిళలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే తీజ్ వేడుకల్లో సోమవారం డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువతులు తమ ఆచార, సాంప్రదాయబద్ధంగా తీజ్ వేడుకలను నిర్వహించుకుంటారన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ధీరావత్ నందినిరవితేజ, నాయకులు కొర్ర నాగునాయక్, కొమ్ము దాసు, మాలోతు శివకుమార్, హాతీరాంనాయక్, కోట ఈశ్వరయ్య, ధనావత్ కిషన్‌నాయక్, శ్రీనునాయక్, బాలునాయక్, శివ, అశోక్‌కుమార్, వినోద్‌కుమార్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు